వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ సాయిప్రకాష్ నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అధికారులపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ ప్రశ్నలవర్షం రైతు వేదిక భవనాలను మౌలిక వసతులు కల్పించేంతవరకు ప్రారంభించరాదని అన్నారు. చాలాచోట్ల ప్రారంభించిన వాటిలో పర్యవేక్షణ లేక ఫర్నీచర్ ధ్వంసం అయిందన్నారు. వెటర్నరీ డాక్టర్ స్వరూపరాణి సబ్సిడీ గొర్రెలకు సంబంధించి మండలంలో మొత్తం 24 సంఘాలు ఉన్నాయని తెలిపారు. త్వరలో మళ్లీ గొర్రెల పంపిణీ చేసే అవకాశం


మాట్లాడుతున్న ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి

ఉందని సంఘాల వారు ఎన్నికలు నిర్వహించుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడ్డుతగిలారు. గ్రామాల్లో ఎలాంటి పనులు చేయడంలేదని మండిపడ్డారు. కొన్ని గ్రామాల్లో లైన్‌మెన్‌లు వేరే ఊళ్లలో ఉంటూ ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని ఫిర్యాదుచేశారు. అదేవిధంగా తాగునీటి సరఫరాలో లోపాలపై వాటర్‌గ్రిడ్ అధికారిని ప్రశ్నించారు. అనేక శాఖలలో ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దీంతో సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంపీడీఓ ప్రజాప్రతినిధులను శాంతిపజేశారు. కాగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రాకపోవడంతో ఎంపీడీఓ, ఎంపీపీ ఫోన్‌లు చేసి పిలవాల్సి వచ్చింది. దీంతో సభ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. కొందరు అధికారులు కూడా గైర్హాజరయ్యారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

గద్వాల: పట్టణ, మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గద్వాల మండలం బస్రాచెరువు-1 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలనలో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల ఎంఈఓ సురేష్ బహుమతులను అందజేశారు. విద్యార్థి ఉపాధ్యాయులతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతు, పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు హైమవతి, వెంకటేశ్వర్లు, సురేష్, గోపాల్, రమణారెడ్డి, మద్దిలేటి, సీఆర్పీ సమీ పాల్గొన్నారు.

మద్దూరులో..

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో శనివారం ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు వెంకటస్వామి, శాంతకుమారి, సిఆర్పీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



అలంపూర్: కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. కర్నూల్‌లోని నివాసంలో ఆయనను నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు శనివారం కలిశారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కరాటే విద్యార్థికి సన్మానం



గద్వాల అర్బన్: పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మాలిమ్ తైమూర్ ఆదివారం నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరగబోయే నేషనల్ లెవెల్ ఉషో కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డీఎండబ్ల్యూఓ ప్రసాద్‌రావు శనివారం మాలిమ్ తైమూర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. పంజాబ్‌లో జరిగే నేషనల్ లెవెల్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని, ఉత్తమ ప్రతిభ చాటి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉషో కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు అతికూర్ రహ్మాన్, మాస్టర్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



అలంపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని అన్నీ వార్డులలో అంతర్గత రోడ్ల నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య చెట్టి చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ సుష్మను సన్మానించారు. కాలనీవాసులు ప్రహ్లాదరావు, వేణు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా మురళీధర్



మానవపాడు: బీజేపీ మండల అధ్యక్షుడిగా మురళీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి నియమకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కేకే రెడ్డి, బలరాంరెడ్డి, బంగి లక్ష్మణ్, రాజగోపాల్, సురేష్, శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో మండల బీజేపీ నాయకులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో అక్రమంగా అరెస్ట్ చేసిన బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాను ప్రకాశ్‌ను వెంటనే విడుదల చేయాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టేందుకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నాయకులు జగదీష్‌రెడ్డి, సంపత్, దశరథంసాగర్, రాజేష్, తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం'



శాంతినగర్: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో జిల్లా అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ అధ్యక్షతన యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, తాలూక యువజన అధ్యక్షుడు జోగులరవి, మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సురేష్


మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందు రావ్

గద్వాల అర్బన్: చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ సురేష్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి, చెనుగొనిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో బాలల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేంచి, వాటిని సాధించే దిశగా ముందుకెళ్లాలన్నారు. పిల్లలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని, బాలబాలికలకు వేధింపులు, సమస్యలు కలిగితే వెంటనే డయల్ 100 లేదా 1098కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

రాజోళి: బాల్య వివాహాలను అరికట్టడం కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీడీఓ గోవిందు రావ్ అన్నారు. శనివారం ఎంమ్మార్సీ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీంతో వాటిని తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని గద్వాల టౌన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు గద్వాల పట్టణంలోని గాంధీచౌక్, బుర్దపేట, గంజిపేట, గంట వీధి, కొత్త బస్టాండు, పాతహౌసింగ్ బోర్డు, అంబేద్కర్ చౌక్, సెంకండ్ రైల్వేగేట్ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా కాలనీవాసులు సహకరించాలని కోరారు.

అయిజ: విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగలకుండా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఈ గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తొత్తినోనిదొడ్డి శివారులోని 132/33 కేవీ ఫీడర్‌కు సంబంధించిన చిన్నతాండ్రపాడు, ఉత్తనూరు, తొత్తినోనిదొడ్డి, మిట్టదొడ్డి, ఇందువాసి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

అలంపూర్: చెట్ల కొమ్మలను తొలగించే నేపథ్యంలో 33 కేవీ పరిధిలోని 33/11కేవీ ఉప కేంద్రాలైన మానవపాడు, శ్రీనగర్, శాంతినగర్, రామాపురం, పెద్ద తాండ్రపాడు, రాజోలి, చాగాపురం, ఉండవెల్లి, జల్లాపురం, మారమునగాల, అలంపూర్, భీమవరం సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ మహమ్మద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

అయిజ: మండలంలోని వెంకటాపురంలో ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి తల్లి అనసూయమ్మ (86) అనారోగ్యంతో శనివారం మృతిచెందడంతో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌తో బ్యాంకు రుణాల పరిష్కారం



ఆత్మకూర్: దీర్ఘకాలికంగా బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించలేని వారికి లోక్ అదాలత్‌తో బ్యాంకు వారు ఏర్పాటు చేసిన బ్యాంక్ అదాలత్‌లో రుణ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆత్మకూర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్ శిరీష అన్నారు. ఆత్మకూర్ సివిల్ కోర్టులో శనివారం అమరచింత యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాంక్ అదాలత్‌లో పాల్గొని రుణగ్రస్తుల ద్వారా నగదును రికవరీ చేశారు. తొమ్మిదేళ్ల కిందట రుణాలు పొందిన తొమ్మిది మంది ఇప్పటికీ రుణాలు చెల్లించలేదు. వీరికోసం లోక్ అదాలత్ నిర్వహించగా 13 కేసులు పరిష్కారయ్యాయని తెలిపారు. వీరి నుంచి మొత్తంగా రూ.2.3లక్షలు వసూలు అయ్యాయని బ్యాంక్ మెనేజర్ సాయిచంద్ తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు తిప్పారెడ్డి, జీకే రాములు, న్యాయవాదులు ముక్తేశ్వర్, సుదర్శన్‌గౌడ్, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

ధరూరు: తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు హరిజన గేరి ప్రాథమిక పాఠశాల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది అంతా చదివింది ఒక ఎత్తైతే ఈ నెల రోజులు మరో ఎత్తన్నారు. వారికి ఈ నెల రోజుల పాటు చదువును కునే వెసలుబాటును, తగిన వాతావరణాన్ని కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే పిల్లలు ఇంటి వద్ద చదువుకుంటున్నారా లేదా అని చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేవతి, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎరువుల విక్రయానికి అనుమతి తప్పనిసరి


డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఆయూబ్

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి రైతుకు తప్పకుండా ఒరిజినల్ రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ఆయూబ్ డీలర్లకు సూచించారు. శనివారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం రైతు వేదికలో ఎరువులు, విత్తన, పురుగు మందుల డీలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు పొందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. లేనిచో చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఈఓ మౌనిక, డీలర్లు, తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, అమరవాయి చింతలాముని నల్లారెడ్డి స్వామి, బిజ్వారం, నాగర్‌దొడ్డి, తాటికుంట, ఎల్కూరు, అమరవాయి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణ స్వామి ఆలయాల వద్ద దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, ఆలయ అర్చకులు ధీరేంద్రదాసు, చంద్రశేఖర్ రావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

'అవినీతి పాలనను అంతం చేద్దాం'

అయిజ: బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అవినీతి పాలనను కాంగ్రెస్‌ను గెలిపించి అంతంచేద్దామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కేశవరం, వేణిసోంపురంలో హాత్ సే హాథ్ జోడో యాత్రను కొనసాగించిన సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ మోసపూరితమైన హామీలిచ్చి అధికారాన్ని దక్కించుకొని ప్రజల సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. అలంపూర్‌లో అన్ని వర్గాల ప్రజలు కష్టాల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అలంపూర్ ప్రజల బతుకులు మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.


యాత్రలో పాల్గొన్న సంపత్‌కుమార్

'రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం'

అలంపూర్: ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలను బీఎస్పీ నాయకులు శనివారం సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడుతూ...రైతులు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. రైతులు కేంద్రాల్లో 15 రోజులుగా ఎదురు చూస్తున్నారన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గత వారం కేంద్రాలను సందర్శించి అధికారులతో మాట్లాడి గన్నీ బ్యాగుల సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మండలాల అధ్యక్షులు ప్రభుదాస్, నాగరాజు, ఉపాధ్యక్షుడు శివ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ఏవీఎన్ రెడ్డి గెలుపుపై తపస్ సంబురాలు


సంబరాలు నిర్వహిస్తున్న తపస్ నాయకులు

గద్వాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించడంతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. రోడ్లపై వెళ్తున్న ప్రతి ఒక్కరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. తపస్ అనుకూల నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు సైతం తపస్ సంబరాల్లో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా పీఆర్టీయూలో క్రియాశీలకంగా ఉన్న అయిజ మండలం భూంపురం ఉపాధ్యాయుడు భీమేశ్వర్‌రెడ్డి తపస్‌లో చేరారు.

ఇది ఉపాధ్యాయుల విజయం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంపై తపస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఉపాధ్యాయులు సాధించిన చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. సంబరాలు నిర్వహించిన అనంతరం తపస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, నరేష్ మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఉపాధ్యాయులు తపస్ నాయకత్వంపై నమ్మకం ఉంచి ఇంతటి ఘన విజయాన్ని కట్టబెట్టారన్నారు. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం సాగిస్తామని చెప్పారు. సమావేశంలో తపస్ నాయకులు నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, నల్లారెడ్డి, భాస్కర్, రత్నాకర్‌రెడ్డి, మహేందర్, వెంకటేష్, రవి, మోహన్, రాము, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కలిసి శ్రమిద్దాం.. ఇందిరమ్మ రాజ్యాన్ని తెద్దాం

అమరచింత: ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ తీసుకొచ్చి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుడి పోరాడాలన్నారు. కార్యక్రమంలో నారాయణ పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కేజీ మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్ గౌడ్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కురుమన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ప్రకాశం, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్‌రెడ్డిని ఎన్నుకోన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, శ్యామ్, పోషిరిగారి విష్ణు, నాగునాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కమిటీ నాయకులతో నాగరాజుగౌడ్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గద్వాల రూరల్: ఆపదలో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, హనుమంతు, నరేందర్, శ్రీరాములు, నారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ పార్కు పరిశీలన

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ పార్క్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహ్లాదకంగా అన్ని అంగులతో పార్క్, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి కావడంతో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, ఏఈ రమేష్ నాయుడు, నాయకులు సాయినాథ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం ఉందని డీఎంఆర్ఎం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు అన్నారు. డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలను గౌరవించడం, తోటి వారితో మర్యాదగా నడుచుకోవడం అనే అంశాలను ఉపాధ్యాయులు చదువుతో పాటు విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల హాజరు, ప్రతిభాపాటవాలు ఎప్పటికప్పుడు గుర్తించి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, ప్రతి నిత్యం భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించాలని తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలస్వామి. సీఆర్పీ స్వామి, ఉపాధ్యాయులు బీటీ కిరణ్, పద్మ, అంజుంషాహిన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభా పాటవాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

వ్యక్తిపై దాడి: ఐదుగురిపై కేసు నమోదు


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

మల్దకల్: ఓ వ్యక్తిపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం మండలంలోని అమరవాయిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అమరవాయికి చెందిన బోయ సవారన్నను అదే గ్రామానికి చెందిన చిన్ననల్లన్న, బజారి, సవారన్న, రామన్న, కిష్టన్న ఓ కేసులో ఎలాంటి సంబంధం లేకపోయినా సవారన్నను గ్రామంలో విద్యుత్ స్తంభానికి కట్టేసి కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో సవారన్న తీవ్రంగా గాయపడడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టిప్పర్ శుక్రవారం రాత్రి రాయిచూరు వైపు నుంచి గద్వాలకు ఇసుక తరలిస్తుండగా కేటీదొడ్డి వద్ద పట్టుకున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అనుమతులు లేవని విచారణలో వెల్లడైందని, ఈ మేరకు టిప్పర్ ఓనర్ మహేందర్‌గౌడ్, డ్రైవర్ భరత్‌రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.